బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు పెద్దపీట
- అన్ని రంగాల్లో మంచి అవకాశాలు
- మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌ను గెలిపించుకోవాలి
- ఫ్యాను గుర్తుకే అందరూ ఓటు వేయాలి
- అప్పుడే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయి
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి మురుగుడు లావణ్య



ఓటు అభ్యర్థిస్తున్న మురుగుడు లావణ్య

తాడేపల్లిరూరల్: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, వైఎస్సార్ సీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యమిచ్చి పరిపాలన చేస్తున్నారని వైఎస్సార్ సీపీ మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య అన్నారు. ఎప్పుడైతే బలహీన వర్గాలకు చట్టసభల్లో అవకాశం లభిస్తుందో.. పేదల కష్టాలను చర్చించడానికి అవకాశం లభిస్తుందని ఆమె పేర్కొన్నారు. బుధవారం మంగళగిరి పట్టణ పరిధిలోని 28వ వార్డులో మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలతో కలసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మురుగుడు లావణ్య స్థానిక చేనేతలు ఘన స్వాగతం పలికారు. హారతులు పట్టారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో పేద ప్రజలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాల్లో మార్పు తీసుకువచ్చేందుకు మొదట విద్యా రంగంపై దృష్టి సారించినట్లు తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విద్య నేర్చుకుంటున్నారని పేర్కొన్నారు. వైద్య రంగంలో పెనుమార్పులు తీసుకువచ్చి, అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మించి పేదల ప్రజలకు ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చారని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ఏడుగురు ముస్లింలను ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించి, సీఎం వైఎస్ జగన్ పోటీలో నిలబెట్టారని చెప్పారు. జిల్లా బీసీ సెల్ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, సీనియర్ నాయకులు ఫిరోజ్, మల్లవరపు సుధారాణి, ప్రభాకర్, కొల్లి గిరి, ఎస్కే బాజి, దూళ్ళ కోటేశ్వరరావు, దేశమాలి అనిల్, బిట్ర ఉమ, మద్దిరాల విజయ్ పాల్గొన్నారు.

విరామ బైబిల్ పాఠశాల తరగతులు ప్రారంభం



చిన్నారులకు శిక్షణ ఇస్తున్న దైవ సేవకురాలు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో నూతన యెరుషలేము ప్రార్థన మందిరంలో బుధవారం నుంచి విరామ బైబిల్ పాఠశాల తరగతులు ప్రారంభమైనట్లు దైవ సేవకుడు ఐజక్ చార్లెస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరగతులను విజయవాడ కర్మల్ ప్రార్థన మందిరం దైవ సేవకులు, జిల్లా ఇన్‌చార్జి జోసఫ్ ప్రారంభించారని, మే 4వ తేదీ వరకు 10 రోజులు నిర్వహించనున్నామని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యార్థులకు, యవ్వనస్తులకు బైబిల్ పాఠాలు, క్రాఫ్ట్స్, గేమ్స్, యాక్షన్ సాంగ్స్, వర్క్‌బుక్స్, పెప్పెట్ షో వంటి కార్యక్రమాల్లో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. మొదటిరోజు ప్రపంచం – మానవ సృష్టి అనే అంశంపై బైబిల్ పాఠాలు నేర్పించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సహోదరులు డైమండ్ రాజు, ప్రకాష్, ఆనందరాజు, తిమోతి, దైవ సేవకురాలు ప్రిస్కిల్లా చార్లెస్, హైదరాబాద్, మదనపల్లి నుంచి సండే స్కూల్ టీచర్లు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్, ఏక్విటీ సొల్యూషన్స్ ప్రతినిధులు తదితరులు

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ ఆత్మకూరులోని నిర్మల ఫార్మసీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పాములరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ బహుళ జాతి సంస్థ ఏక్విటీ సొల్యూషన్స్ తమ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించిందని, వివిధ కళాశాలల నుంచి వచ్చిన 120 మంది విద్యార్థులకు రాత, శ్రవణ పరీక్షలు, బృంద చర్చలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఇందులో 27 మంది విద్యార్థులు ఎంపికయ్యారని, వీరికి వార్షిక వేతనంగా రూ.4.8 లక్షలు అందజేయబడతాయని తెలిపారు. కళాశాల సెక్రటరి సిస్టర్ జి.నిర్మలజ్యోతి మాట్లాడుతూ ఎంపికైన వారిలో నిర్మల ఫార్మసీ కళాశాల విద్యార్థులు 11 మంది ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శంఖుల కామేశ్వరరావు, సమన్వయకర్తలు డాక్టర్ సుధీర్, జోజిబాబు, ప్రాతూరి అశోక్ కుమార్, సాంకేతిక సిబ్బంది శ్రీహరి, విజయకుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

12 మంది జూదరుల అరెస్ట్..

తాడికొండ: తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెంలోని నివాసంలో పేకాట శిబిరంపై పోలీసులు దాడులు నిర్వహించి 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. బత్తుల కోటేశ్వరరావుకు చెందిన నివాసంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు సీఐ అనురాధ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. రూ. 29,300లు నగదు, 12 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ షేక్ సుభాని తెలిపారు.

డోలు, నాద స్వరంతో వినూత్న నృత్యం

పలువురికి యువ కళారత్న పురస్కారాలతో సత్కారం



నృత్యం చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలోని అన్నమయ్య కళావేదికపై శ్రీ సాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న 14వ అంతర్జాతీయ నృత్య దినోత్సవం-2024 బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు లంకా విజయబాబు జ్యోతి ప్రజ్వలన చేయగా, డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. కూచిపూడి నృత్య సంప్రదాయంలో ప్రప్రథమంగా డోలు, నాదస్వరంతో వినూత్న కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ ఖాజా వెంకట సుబ్రహ్మణ్యం దర్శకత్వం నిర్వహించారు. గాత్రం జి.భువనేశ్వరి, టీఎం కృష్ణారావు, నాదస్వరం ఎంవీ సుబ్బరామయ్య, క్యాసియో తిన్నలూరి హరిబాబు, డోలుపై ఎం.హరిబాబు సహకారం అందించారు. అనంతరం పచ్చల నాగమహిత, తాళ్లూరి ధరణి, బీసా లక్ష్మిని పూజితశ్రీలను యువ కళారత్న పురస్కారంతో సన్మానించారు. పఠకమూరి సుప్రియ, దేవేంద్ర గ్గాయత్రి, ఎర్రగుంట హేమతోషిక చౌదల నాట్యం ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.ఎ స్.గోవిందరాజన్, సంస్థ కార్యదర్శి వెంకటగిరినాగలక్ష్మి, గరికపాటి శిరీష పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో హెల్త్ కమిషనర్ ఆకస్మిక తనిఖీలు



జీజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వర్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ చిన్నపిల్లల వార్డు, కాన్పుల వార్డులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల కాలంలో ఆస్పత్రుల్లో చిన్న పిల్లల అపహరణ జరుగుతున్న నేపథ్యంలో వాటిని అరికట్టడానికి ఏర్పాటు చేసిన ఆర్ఎఫ్ఐడీ పని తీరును ఆయన పరిశీలించారు. ఆస్పత్రి నుంచి చిన్న పిల్లలను గుర్తు తెలియని వ్యక్తులు గుట్టు చప్పుడు కాకుండా తీసుకుని వెళ్లే వారిపై నిఘా పటిష్టం చేస్తున్న విధానాన్ని ఆయన నిశితంగా పరిశీలించారు. తల్లి, బిడ్డకు ఏర్పాటు చేసిన ట్యాగ్ పని తీరును కూడా ఆయన పరిశీలించారు. కాన్పుల వార్డులో బాలింతలతో కమిషనర్ మాట్లాడారు. సాధారణ ఆపరేషన్లు జరుగుతున్నాయా, శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయా అనే విషయాలపై బాలింతల తల్లులతో మాట్లాడారు. తల్లి,బిడ్డ క్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. 24 గంటలపాటు తల్లి,బిడ్డ పర్యవేక్షణ చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రిలోని పలు వార్డులను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై కమిషనర్ సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. పసిబిడ్డలకు ట్యాగ్స్ అమర్చేప్రక్రియ నర్సింగ్ సిబ్బంది చేయాలని కమిషనర్ సూచించారన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో కాన్పు అయిన తరువాత చిన్నపిల్లల వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నవజాత శిశువులకు ఈ ట్యాగ్‌లు అమర్చాలని సూచించినట్లు వెల్లడించారు. తల్లికి అమర్చే ట్యాగ్ లు లాక్ సిస్టం లేదని, అది అత్యవసరమని కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ఈ మార్పుకు అంగీకరించి వెంటనే అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించినట్లు సూపరింటెండెంట్ వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విజయలక్ష్మి ఉన్నారు.

నేటి నుంచి కిడ్నీ ఉచిత పరీక్షలు

మంగళగిరి: నగరంలోని ఇందిరానగర్ యూపీహెచ్‌సీలో గురు, శుక్ర వారాల్లో ఉచిత కిడ్నీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సుమారు ఐదేళ్ల నుంచి దీర్ఘకాలికంగా బీపీ, షుగర్‌లతో బాధపడే వారికి, కిడ్నీ సమస్యలు ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు, గుండెకు స్టంట్ వేయించుకున్న వారు కూడా ప్రస్తుతం వాడుతున్న మందులతో హెల్త్ సెంటర్‌కు వచ్చి కిడ్నీ పరీక్షలు చేయించుకోవచ్చునన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. సంబంధిత వ్యాధులు ఉన్న రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ అనూష కోరారు.

విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని గుండిమెడకు చెందిన విద్యార్థి కనిపించడం లేదంటూ విద్యార్థి బాబాయి బుధవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. గుండిమెడకు చెందిన కాట్రగడ్డ యశ్వంత్ గుండిమెడలో ఉన్న హాస్టల్‌లో ఉంటున్నాడు. నెల 20న హాస్టల్ నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, కుటుంబ సభ్యులు, బాబాయి మహేంద్ర చుట్టుపక్కల విచారించి, బంధువులను అడిగినా ఎటువంటి ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా యశ్వంత్‌ను గుర్తుపడితే 86888 31355, 92912 82666, 86865 53666 నంబర్లకు తెలియజేయాలని ఎస్ఐ రమేష్ కోరారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు భావి తరాలకు మార్గదర్శకులుగా ఉండాలని నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని ఆర్వీఆర్ బీఈడీ కళాశాలలో బుధవారం 2023–25 బ్యాచ్ విద్యార్థులకు స్వాగతం కార్యక్రమంతో పాటు 2022–24 బ్యాచ్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్య అభ్యసిస్తున్న భావి ఉపాధ్యాయులు బోధనా వృత్తిలో నైపుణ్యవంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం యూనివర్సిటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ గద్దె మంగయ్య, కోశాధికారి వి.కుప్పుస్వామి, విశ్రాంత ప్రొఫెసర్ వజ్జా రంగారావు, ప్రిన్సిపాల్ మోటూరి రవి కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు ప్రదానం



ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్ఎం పి.చంద్రశేఖర్

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తయిన 20 మంది ఒకేషనల్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ఒకేషనల్ కోర్సులతో పాటు ఇంటర్న్‌షిప్ చేయడం ద్వారా విద్యార్థులకు త్వరగా ఉద్యోగ అవకాశాలు వస్తాయని వివరించారు. ఇంటర్న్‌షిప్ విజయవంతం కావడానికి సహకరించిన సమగ్ర శిక్షా అభయాన్, లెర్న్ స్కిల్స్ వారికి, ఒకేషనల్ ఉపాధ్యాయులు పి.ఝాన్సీకి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే సుచరిత ఎన్నికల ప్రచారం

తాడికొండ: ఎమ్మెల్యే మేకతోటి సుచరిత గురువారం ఉదయం 8.30 గంటలకు తాడికొండ మండలం కంతేరు గ్రామంలో జరిగే ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు మేడికొండూరు మండలం పేరేచర్ల ప్రజలను కలిసి ఓటు అభ్యర్థించనున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

141 మందికి వైద్య పరీక్షలు



ఫిరంగిపురం: మండలంలోని కండ్రిక గ్రామంలో బుధవారం నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యాధికారి ఫరీనా బేగం 141మందికి వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు అందజేశారు. గర్భిణులకు యూరిన్, థైరాయిడ్, షుగర్ పరీక్షలు చేశారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సబ్ సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని, వడదెబ్బ తగిలిన వారు తప్పనిసరిగా పౌడర్‌ను నీటిలో కలుపుకొని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటలక్ష్మి, పీహెచ్ఎన్ గాయత్రిదేవి, హెచ్‌వీ నూర్ ఖాజాబీ, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దనే ఓటు వేసేందుకు 78 మంది నమోదు



ఫిరంగిపురం: ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోలేని వయోవృద్ధులకు 12డీ ఫాంలను అందజేసినట్లు తహసీల్దారు జి.రాఘవరావు బుధవారం తెలిపారు. ఎన్నికల కమిషన్ ఈసారి ఇంటివద్దనే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. దానిలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ఇప్పటి వరకు 753 12డీ ఫాంలు బీఎల్వోలకు అందజేయగా వారిలో 78 మంది మాత్రమే ఇంటివద్ద నుంచి ఓటు వేసేందుకు సుముఖత వ్యక్తం చేస్తూ పత్రాలు అందజేసారన్నారు. కాగా మిగిలిన వారు తాము పోలింగ్ బూత్ వద్దకే వచ్చి ఓటు వేస్తామంటూ తెలియజేసినట్లు ఆయన చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



తాడికొండ: రాయపూడి సీడ్ యాక్సిస్ నాలుగు రోడ్ల జంక్షన్‌లో పల్లికోనకు ప్రేపుల్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉచిత చలివేంద్రం బుధవారం ప్రారంభించారు. ఈ శిబిరాన్ని తుళ్లూరు ట్రాఫిక్ ఎస్ఐ లేఖ ప్రియాంక రిబ్బన్ కత్తిరించి, ప్రారంభించారు. ప్రయాణికులకు మజ్జిగ, మంచినీరు అందించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ పి.సాల్మన్ రాజు మాట్లాడారు. వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు గుంటూరుతో పాటు బాపట్ల జిల్లాలో పలు చోట్ల తాము చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పాస్టర్ సువర్ణ కమలమ్మ, బసవ పున్నయ్య పాల్గొన్నారు.

మంగళగిరిలో 19 నామినేషన్లు దాఖలు

మంగళగిరి: మంగళగిరి శాసనసభ నియోజకవర్గానికి బుధవారం 11 మంది అభ్యర్థులు 19 నామినేషన్లు దాఖలు చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జి.రాజకుమారి తెలిపారు. ప్రస్తుతం మొత్తం 37 మంది అభ్యర్థులు 57 నామినేషన్లను దాఖలు చేసినట్లు ఆమె వెల్లడించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి



తెనాలిరూరల్: కొలకలూరు శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్కువ మంది చదువరులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకునే విధంగా, గ్రంథాలయాన్ని ఎక్కువ మంది పాఠకులు వినియోగించుకునే విధంగా చేయాలని ఈ సందర్భంగా ఆమె గ్రంథాలయాధికారి కడియాల సుజాతను ఆదేశించారు. ఇక్కడ అందుతున్న గ్రంథాలయ సేవల గురించి పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. మే 7వ తేదీ వరకు గ్రంథాలయంలో వేసవి శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు.

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి మేకతోటి సుచరిత
- కొర్రపాడు గ్రామంలో ఎన్నికల ప్రచారం
- పాల్గొన్న గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య
- హారతుల పట్టి, ఘన స్వాగతం పలికిన స్థానికులు

మేడికొండూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేకతోటి సుచరిత అన్నారు. బుధవారం మండలంలోని కొర్రపాడు గ్రామంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు హారతులు పట్టారు. దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, మేళతాళాలతో ఎస్సీ కాలనీ వాసులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మేకతోటి సుచరిత, కిలారి వెంకట రోశయ్య మాట్లాడారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకుంటే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కుల రాజకీయాలు, దాడులు చేయించడం ద్వారా పబ్బం గడుపుకోవాలని చూస్తున్న టీడీపీ నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. మంచి చేస్తేనే.. ఓటు వేయండి అని జగనన్న ఇచ్చిన పిలుపును గుర్తుంచుకోవాలన్నారు. గ్రామంలో ప్రతి గడపకు తిరిగి సీఎం వైఎస్‌జగన్ పేదలకు చేసిన మేలును వివరించారు. కుల, మత ప్రాంతాలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. సంక్షేమ పథకాలు ఇలానే కొనసాగించాలంటే ఆయనను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మే 13వ జరుగనున్న ఎన్నికల్లో తమ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాను గుర్తుపై వేసి, ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.నాగమల్లేశ్వరరావు, ఎంపీటీసీ మల్లిపెద్ది లక్ష్మణబాబు, ఎంపీపీ మన్నవ స్వప్న రాజేష్, మండల కన్వీనర్ తాళ్లూరి వంశీకృష్ణ, వైస్ సర్పంచ్ మరియదాసు, జేసీఎస్ కన్వీనర్ అబ్బాస్, గోపిదేశి శ్రీను, లూర్దు రాజు, నరసింహారావు, కొరివి కిషోర్, కాంతయ్య, ఆవుల సంజీవరెడ్డి, రస్ హుస్సేన్, షేక్ సుభాని, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొర్రపాడు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి సుచరిత, ఎంపీ అభ్యర్థి కిలారికి సన్మానం

రాయితీని సద్వినియోగం చేసుకోండి



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణ పరిధిలోని ఇంటి, ఖాళీస్థలాల పన్నులను ఒకేసారి చెల్లిస్తే ప్రభుత్వం ఐదు శాతం రాయితీ ఇస్తుందని, దీనిని అందరూ ఉపయోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ప్రముఖ వ్యాపారి కొత్త మాసు తులసీదాసుకు సంబంధించిన ఆస్తి పన్నుల చెక్కును బుధవారం కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30లోపు ఏడాదికి సంబంధించిన పన్నులను చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ అధికారి సోమశేఖర్ యాదవ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మోహన్‌కృష్ణ, పాల్గొన్నారు.

తాడికొండలో 3 నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న మేకతోటి హర్షిత్ బాబు

తాడికొండ: తాడికొండ 86 అసెంబ్లీ నియోజకవర్గానికి బుధవారం 3 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.గంగరాజు తెలిపారు. ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కుమారుడు మేకతోటి హర్షిత్ బాబు నామినేషన్ దాఖలు చేయగా, టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ తమ్ముడు తెనాలి కాంతి సుమన్ బాబు నామినేషన్ దాఖలు చేశారు. తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ నుంచి నిడుముక్కల గ్రామానికి చెందిన మెండెం మరియదాసు మరో నామినేషన్ దాఖలు చేశారు. బీఎస్పీ అభ్యర్థి శృంగారపాటి బాబురావు, టీడీపీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ రెండవ సెట్ నామినేషన్ పత్రాలు సమర్పించినట్లు ఆర్వో గంగరాజు తెలిపారు.

దోమల నియంత్రణకు చర్యలు

డీఎంహెచ్ఓ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి, పక్కన సుబ్బరాయణం

గుంటూరు మెడికల్: దోమల నియంత్రణకు చర్యలు తీసుకున్నట్లు డీఎంహెచ్ఓ కె.విజయలక్ష్మి తెలిపారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 'ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం మలేరియా వ్యతిరేక పోరాటాన్ని ఉధృతం చేద్దాం' అనే నినాదంతో వరల్డ్ మలేరియా డే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దోమల నియంత్రణలో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. దోమలు ఇంట్లోకి ప్రవేశించకుండా సాయంత్రం 5 గంటలకు తలుపులు, కిటికీలు మూసివేయాలన్నారు. వేప పొగ వేయుట, మెష్ డోర్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా దోమలు ఇంట్లోకి రాకుండా కట్టడి చేయవచ్చని పేర్కొన్నారు. దోమకాటు నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా దోమతెరలు వాడాలని చెప్పారు. దోమల నియంత్రణలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. తరచూగా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దోమలు పెరగకుండా కొబ్బరి చిప్పలు, టీ కప్పు, టైర్స్, పూల కుండీలలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలని చెప్పారు. గురువారం ఉదయం 8.30 గంటలకు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ప్రపంచ మలేరియా దినోత్సవంపై ఆరోగ్య శాఖ సిబ్బందితో ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ రాజు నాయక్, గణేష్, జయప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎండలకు జాగ్రత్తలు తీసుకోవాలి

కొద్దిరోజులుగా జిల్లా వ్యాప్తంగా ఎండలు ముఖ్యంగా వడగాడ్పులు తీవ్రంగా వీస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటలలోపు బహిరంగ ప్రదేశాల్లో తిరగకుండా, సాధ్యమైనంత మేరకు ఇంట్లోనే ఉండాలన్నారు. అత్యవసర పనుల నిమిత్తం ఇంట్లో నుంచి బయటకు వచ్చేవారు కాటన్, తెల్ల రంగు దుస్తులు ధరించాలని సూచించారు. శరీరం డీహైడ్రేట్ కాకుండా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని, ముఖ్యంగా మజ్జిగ, నిమ్మరసం, సరిపడ మంచినీరు తాగాలన్నారు. తలతిరగడం, వాంతులు, 103 డిగ్రీలకు మించిన జ్వరం ఉంటే వడదెబ్బ తగిలినట్లుగా గుర్తించి, తక్షణమే వారిని నీడకు ప్రదేశానికి తరలించాలన్నారు. బట్టలు వదులు చేసి ఫ్యాన్ కింద కూర్చోబెట్టాలని చెప్పారు. ఏసీలో ఉంచి చికిత్స చేయడం ఉత్తమమని పేర్కొన్నారు. బాధితుడి పరిస్థితి తీవ్రంగా ఉంటే ఆస్పత్రికి తరలించాలని సూచించారు. వడదెబ్బ, డయేరియాపై డీఎంహెచ్ఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు.